చెల్లెలు పెళ్ళి

టెంపోరావ్

రాత్రి తొమ్మిది దాటింది. బలరామ్ ఇరానీ రెస్టారెంట్‌లో కూర్చుని టీ సేవిస్తున్నాడు. నల్లటి ప్లాస్టిక్ బాగ్ అతని ఒళ్ళో వుంది. టీ తాగడం ముగించి అతడు చార్మినార్ సిగరెట్ వెలిగించాడు. పొగ వదులుతూ నలువైపులా చూశాడు. అతడికన్ని వైపులా అనేకమంది కూర్చుని వున్నారు. అతని కెదురుగా వున్న టేబుల్ కటువైపున వున్న రెండు కుర్చీలు ఖాళీగా వున్నాయి.

టెలిఫోన్‌లో తనతో చెప్పినదంతా అతడికి జ్ఞప్తి కొస్తోంది. తొమ్మిదింటికి తను ఇరానీ రెస్టారెంటులో కూర్చుని టీ తాగుతూ వుండాలి. ఎవరో వచ్చి, "హాలో, మిస్టర్ బలరామ్!" అంటారు. ఆ మనిషి కూడా అతడు వెళ్ళాలి.

తనని కలుసుకోవలసిన వ్యక్తి రెస్టారెంటులో వున్నాడా? దగ్గర కొచ్చిన హోటల్ బాయ్‌కి అతడు యాభై పైసలు చెల్లించాడు. పొగ వదులుతూ మౌనంగా

కూర్చున్నాడు. లోలోపల అతను గాభరాపడుతున్నాడు. చివరికి ఈ ప్రయత్నం ఏమవుతుందో? అన్నీ సవ్యంగా జరిగితే తన చెల్లెలు జానకి పెళ్ళి వెంటనే చేసెయ్యవచ్చు. బూట్ల చప్పుడు విని బలరామ్ తన ఆలోచనల్లోంచి తృళ్ళిపడ్డాడు. పొడుగ్గా, సన్నగా సూట్లో వున్న ఒకతను టేబులువైపు వస్తున్నాడు. కాస్సేపట్లో ఆ వ్యక్తి టేబులు దగ్గరగా వచ్చాడు.

"హలో, మిస్టర్ బలరామ్!" అన్నాడతను చెయ్యి చాచుతూ.

అమాంతంగా కుర్చీలోంచి లేని బలరామ్ అతడితో కరచాలనం చేశాడు. ఆ వ్యక్తి గబగబా బయటకు నడిచాడు. వెనకనే వేగంగా అడుగులేశాడు బలరామ్.

రోడ్డు దీపాలు ప్రకాశవంతంగా వెలుగుతున్నాయి. పేవ్ మెంట్ల మీద జనం ఎక్కువగాలేరు. పేవ్ మెంటు వారగా ఒక అంబాసిడర్ కారు ఆగి వుంది. ఆ వ్యక్తి గబగబా కారువైపు వెళ్ళాడు. వెనక తలుపు తెరిచాడు. బలరామ్ కారు వెనుకనున్న నంబరువైపు చూశాడు. ఇటువంటి పరిస్థితుల్లో కారు నంబరు గుర్తుంచుకోడం మంచిది.

బలరామ్ కార్లో ఎక్కి కూర్చున్నాడు. సూటు ధరించిన వ్యక్తి పక్కనే కూర్చుని తలుపు మూశాడు. స్టీరింగ్ వీలు వెనుక కూర్చున్నతను కారు వేగంగా పోనిచ్చాడు.

కారు స్పీడుగా సాగిపోతోంది. కొన్ని నిముషాల పాటు కారులో నిశ్శబ్దంగా వుంది. బలరామ్ గుండె దడదడ కొట్టుకుంటోంది. అతని మెదడులో ఆలోచనలు పరుగెడుతున్నాయి. నూరు అబద్ధాలు చెప్పయినా పెళ్ళి

చెయ్యడం మంచిదన్నారు పెద్దలు. చెల్లెలు పెళ్ళికోసం తనీ కారులో తెగించి ప్రయాణం చేస్తున్నాడు!

"ఇంకా ఎంత దూరం వెళ్ళాలి?" అడిగాడు బలరామ్ నిశ్శబ్దాన్ని భరించలేక.

"వచ్చేస్తున్నాం" అన్నాడు పక్క కూర్చున్న వ్యక్తి.

కారు వేగంగా యింకా వెళ్తూనే వుంది. బలరామ్ ధైర్యాన్ని తెచ్చుకోడానికి ప్రయత్నిస్తున్నాడు. వాళ్ళు మోసగాళ్ళు అయివుండరు. కారు ఎటు వెళుతున్నదీ తను చూడగలుగుతున్నాడు. ఏదేనా ప్రమాదం సంభవిస్తే కారు నంబరు, తను ఎక్కడికి వెళ్ళిందీ పోలీసులకి చెప్పొచ్చు. తటాలున ఒక కాంపౌండ్‌లోకి కారు ప్రవేశించింది. పెద్ద కాంపౌండు. ఎత్తయిన ప్రహారీగోడ. ఇనపగేటును బలరామ్ గుర్తుపెట్టుకున్నాడు. కారు ఒక మేడముందు ఆగింది.

తలుపు తెరిచి సూటు వ్యక్తి కిందకు దిగాడు. బలరామ్‌ని దిగమన్నాడు. ఇద్దరూ ముందు వరండావైపు వెళ్ళారు. విశాలమైన హాల్లోకి ప్రవేశించారు.

హాలు కుడివైపున ఏర్‌కండిషన్డ్ గది వుంది. తలుపును తోసి బలరామ్‌ని లోపలకు వెళ్ళమన్నాడతను. బలరామ్ లోపలకు వెళ్ళాడు. తలుపు వెనకనే మూసుకుపోయింది.

గదిలో ఫ్లోరసెంట్ ట్యూబులు ప్రకాశవంతంగా వెలుగుతున్నాయి. ఎదురుగా గాడ్రెజ్ స్టీలు టేబులుకి అటువైపున కుషన్డ్ కుర్చీలో కూర్చున్న వ్యక్తి లేచి నుంచుని, "మిస్టర్ బలరామ్, వెల్కమ్ టు అవర్ ఆఫీస్" అన్నాడు.

బలరామ్ టేబులుదాకా వెళ్ళి అతడితో కరచాలనం

చేసి ఎదురుగా వున్న కుర్చీలో కూర్చున్నాడు.

బలరామ్ క్షణకాలం ఎదురుగా వున్న వ్యక్తివైపు చూశాడు. ఎదుటి వ్యక్తి సూటులో వున్నాడు. నల్లటి గడ్డం, కళ్ళద్దాలు ధరించాడు. గిరజాల జుత్తు. అతడు నవ్వుతున్నాడు.

"మిస్టర్ బలరామ్, మా క్కావలసింది తెచ్చావా?"

"మీ పేరు?" అడిగాడు బలరామ్.

అతడు విచిత్రంగా నవ్వాడు.

"మిస్టర్ బలరామ్ నా పేరు తెలుసుకోడం వలన నీకే విధంగానూ లాభించదు. మనం మళ్ళా కలుసుకోం. పని పూర్తి అవగానే నీ తోవన నువ్వు వెళ్ళిపోతావు. జరిగిన దాన్ని గురించి ఎవ్వరూ ఎవరికీ చెప్పరు."

"ఈ కాగితం పట్టాడానికి నేను చాలా కష్టపడ వలసి వచ్చింది. ఫైల్లో అతి ముఖ్యమైన ఈ కాగితం లేదని తరవాత తెలుస్తుంది. ముఖ్యుల్నందర్నీ అడుగు తారు. నా ఉద్యోగం ఊడొచ్చు"

"డోంట్ బాదర్. గవర్నమెంటు ఫైల్సులోనుంచి ఎన్నో కాగితాలిలా మాయమవుతున్నాయి. డిపార్టు మెంటు ఎంక్వయిరీ పెట్టిపోయిన కాగితాన్ని గురించి ప్రభుత్వం రెండు నెలల్లో మరచిపోతుంది."

"అయినా మీ రిస్తానన్న అయిదువేలు చాలదు."

"ఎంత కావాలి?"

బలరామ్ క్షణకాలం ఆలోచిస్తూ ఉండిపోయాడు. అతని మెదడులో ఆశలు గూళ్ళు కట్టేస్తున్నాయి. చెల్లెలు పెళ్ళికి కనీసం పదివేలు ఖర్చవుతుంది. మరో పదివేలు చేతిలో వుంచుకోవడం మంచిది. మళ్ళా ఇటువంటి అవ కాశం తనకి రాకపోవచ్చు.

"నాకు ఇరవై వేలు కావాలి. నా చెల్లెలు పెళ్ళి వుంది. అందుకోసం అడుగుతున్నాను."

అతడు తియ్యగా నవ్వాడు.

"సంతోషం. ఒక మంచి కార్యానికి నేనిచ్చే డబ్బు వెళుతున్నందుకు ఆనందిస్తున్నాను. మిస్టర్ బలరామ్, మాతో సహకరిస్తూ మాకు కావలసినవాటిని చుట్టజెప్పే మిత్రులంటే నాకెంతో అభిమానం. నీ చెల్లెలు పెళ్ళికి రాలేను. ఆ సందర్భంలో ఆమెకు నా బహుమతిగా అయిదువేల రూపాయలు నువ్వు అందజెయ్యాలి. నీకు మొత్తం ఇరవై అయిదువేలిస్తాను."

అతడు టేబులు సొరుగును తటాలున లాగి అయిదు నోట్ల కట్టలను టేబులుమీద పడేశాడు.

"ఒక్కొక్క కట్టలో అయిదు వేలుంటాయి" అన్నాడతను నవ్వుతూ.

బలరామ్ ఆనందంగా ఆశ్చర్యంతో చూశాడు. ఇంత సులువుగా ఇంత పెద్దమొత్తం తన చేతికొస్తుందని అతడు అనుకోలేదు.

"చాలా థాంక్స్. ఈ జీవితంలో మిమ్మల్ని మరువను."

బలరామ్ బాగ్ తెరిచి ఒక పొడుగాటి కవర్ను టేబులుమీద వుంచాడు.

ఎదురుగా కూర్చున్న వ్యక్తి కవర్ను అందుకుని, లోపలున్న కాగితాన్ని పరీక్షించి, కవర్ను జాగ్రత్తగా టేబులు సొరుగులో పడేసి మూశాడు.

నోట్ల కట్టల్ని బాగ్‌లో పెట్టి బలరామ్ జిప్పర్ మూశాడు. తొందరగా తను యింటికి వెళ్ళాలి. గంతు లేస్తూ ఈ నోట్ల కట్టల్ని తను తల్లికి, చెల్లికి, భార్యకు

చూపించాలి.

"మిస్టర్ బలరామ్! నువ్వెలా వెళ్తావు?"

"బస్సులో పోతాను."

"ఇంత డబ్బుతో బస్సులో వెళ్ళడం మంచిదికాదు. మా కారులో వెళ్ళి నీ ఇంటి సమీపంలో దిగిపో!"

"మళ్ళా మీకు థాంక్స్!" అన్నాడు బలరామ్.

ఎదురుగా కూర్చున్న వ్యక్తి బజ్జర్ నొక్కాడు. సూటు ధరించినతడు లోపలకు గబగబా వచ్చాడు.

"ఇతడిని మన కార్లో ఇంటికి తీసికెళ్లి అక్కడ వదిలి వచ్చెయ్యండి," అతను తరువిచ్చాడు.

సూటు ధరించిన వ్యక్తి వెనకే బలరామ్ బయటకు నడిచాడు. ఇద్దరూ కారు వెనకసీటుమీద కూర్చున్నారు. డ్రయివర్ పక్కనే లావుగా వున్న మరొకతను కూర్చుని ఉన్నాడు. అతడి తలమీద వెంట్రుకలు లేవు. బోడి గుండు!

కారు గేటువైపు కదిలింది.

"మా యిల్లు తేనాంపేటలో వుంది," అన్నాడు బలరామ్.

పక్కనున్న వ్యక్తి మాట్లాడలేదు. సిగరెట్ వెలిగించి బయటకు చూశాడు. గేటుదాటి, కుడివైపు తిరిగి కారు స్పీడుగా పోసాగింది.

2

అతడు కుర్చీలో వెనక్కివాలి కళ్ళు మూసుకున్నాడు. ఏదో చేయి అతడి గడ్డాన్ని నిమిరింది. అతడు కళ్ళు తెరిచి చూశాడు. అందాలు కురిపించే లత నవ్వుమొహం అతడికి కనిపించింది.

"మైడియర్!" అన్నాడతను.

"బాస్ ఏవిటి అంతగా ఆలోచిస్తున్నావు?" అందామె.

"ఒకతడ్ని యింటికి పంపాను. సక్రమంగా చేరేడో లేదో!"

లత కిలకిల నవ్వింది.

"నువ్వు యింటికి పంపినవాళ్ళు చేరకుండా వుండడం అసంభవం!" అందామె.

అతడు కుర్చీలో తిరిగి ఆమెవైపు నవ్వుతూ చూశాడు.

"నామీద నీకు బాగా నమ్మకం వుందే!"

"నమ్మకం వుండబట్టే నీకింత దగ్గరయ్యాను." అంది లత.

ఆమె నడుమును చేత్తో చుట్టి తనవైపు లాక్కున్నాడతను. ఎర్రటి ఆమె పెదిమలను ముద్దెట్టుకున్నాడు.

"లతా, లెటస్ సెలిబ్రేట్! గెట్ మి స్కాచ్!"

ఆమె సమీపంలో వున్న అలమారువైపు వెళ్ళింది. రెండు గ్లాసుల్లో స్కాచ్ విస్కీ పోసి, ఐస్ క్యూబ్స్ వేసి సోడా కలిపి టేబులుమీద పెట్టింది. ఇద్దరూ ఛియర్స్ అంటూ గ్లాసుల్ని అందుకున్నారు. అతడి పక్కనున్న చిన్న కుర్చీలో ఆమె కూర్చుంది. ఇద్దరూ విస్కీ సేవిస్తున్నారు. నిముషాలు గడుస్తున్నాయి.

ఎవరో తలుపుని తట్టారు.

"కమిన్," అన్నాడతను.

సన్నగా పొడుగ్గా సూటులో వున్న వ్యక్తి గదిలో కొచ్చాడు. అతడి వెనక లావుగా వున్న బోడిగుండు కదుల్తున్నాడు. ఇద్దరూ టేబుల్ సమీపంలో ఆగారు.

"జిమ్, ఏమైంది?" అడిగాడు బాస్.

సన్నటి వ్యక్తి నవ్వుతూ టేబులుమీద నల్లటిప్లాస్టిక్

బాగ్‌ను వుంచాడు. జిప్పర్ తెరిచి బాస్ బాగ్‌ను పరీక్షించాడు. లోపల అయిదు నోట్లకట్టలున్నాయి. ఒక కట్టను బయటకుతీసి సన్నటి వ్యక్తివైపు నవ్వుతూ విసిరాడు. దాన్ని జిమ్ వుషారుగా పట్టుకున్నాడు.

"జిమ్, మీ ముగ్గురూ దాన్ని పంచుకోండి. గుడ్‌లక్! చెప్పవలసింది ఏదైనా వుందా?"

"నతింగ్ బాస్. అంతా అనుకున్న ప్రకారం జరిగింది."

బోడిగుండు వ్యక్తి చేతులు తిప్పుతూ బాస్ వైపు చూశాడు.

"బాస్, ఇటువంటి పన్లు ఎన్నిచ్చినా నేను క్షణంలో ముగిస్తాను." అన్నాడతను.

"ఆల్ రైట్, వెళ్ళండి," అన్నాడు బాస్ అధికార ధోరణిలో.

ఇద్దరూ బయటకు వెళ్ళిపోయారు. గ్లాసులో విస్కీని అతడు గడగడ తాగేశాడు. రిసీవరెత్తి ఒక నంబరు తిప్పాడు. అటువైపు ఎవరో రిసీవరెత్తారు.

"హాలో, రంజిత్ షా స్పీకింగ్!"

"మిస్టర్ షా, నీ గురించి మినిస్టర్ ఫైల్లోవున్న ఆ పత్రం విలువ ఎంత?" అడిగాడతను.

"ఎవరు నువ్వు?"

"నా పేరు చెప్పినా నువ్వు తెలుసుకోలేవు. ఎవరో మిస్టరీమాన్ ఫోన్ చేశాడనుకో. నీకు కావల్సిన పత్రం నా దగ్గరుంది. దానికోసం ఎంతగానో ప్రయత్నిస్తున్నావని నాకు తెలుసు. అది నీకు కావలిస్తే మనం వ్యాపారం ముగించొచ్చు."

"హాలో, ఆ కాగితం నాకొక లక్ష రూపాయలిచ్చి తీసుకుంటాను."

అతడు గంభీరంగా నవ్వాడు.

"ఆ కాగితం మళ్ళా మినిస్టర్ ఫైలుకి చేరకుంటే నువ్వు ఏళ్ళతరబడి జైల్లో కూర్చోవాలి."

"మిస్టర్, నీ కెంత కావాలి?"

"నువ్వు ఇస్తానన్నదానికి అయిదురెట్లు."

"గుడ్ హెవెన్స్! ఆ కాగితం అంత విలువ చెయ్యదు."

"ఆల్ రైట్, దాన్ని మళ్ళా మినిస్టర్ ఫైల్లో పెట్టించేస్తాను. గుడ్ నైట్!"

"ప్లీజ్, ఆగు. డోంట్ డిస్కనెక్ట్." అరిచాడు షా ఖంగారుగా.

"మిస్టర్ షా, నేను వెంటనే ఒక పార్టీకి వెళ్ళాలి. నీతో మాట్లాడుతూ జాగారం చెయ్యలేను."

"మిస్టర్, నువ్వడిగినంతా యిస్తాను. ఎలా యివ్వాలి? ఎప్పుడు?"

"డబ్బు సిద్ధంగా వుందా?"

"వుంది."

"మిస్టర షా, ఇప్పుడు పదిన్నరయింది. సరిగ్గా పదకొండింటికి బీచ్‌లో గాంధీ విగ్రహందగ్గర నిలబడు. అయిదు లక్షలు బాగ్‌లో వుంచు. నీ ముందు మా కారు ఆగుతుంది. మా మనిషి నీదగ్గర కొస్తాడు. వెంటనే అతనితో వెళ్ళి ఆ కారులో కూర్చో. మా వాళ్ళు నీకు ఒక కవరిస్తారు. అందులోని కాగితం సరైనదో కాదో చూసుకో. నువ్వు కాగితం పరిశీలించే సమయంలో మా మనిషి నీ నోట్లను తెచ్చి చూస్తాడు. అటుపైన నువ్వు కావల్సిన చోట దిగిపోవచ్చు. సరేనా?"

"అలాగే చేస్తాను. కాని ఒక్క మార్పు. నాకు

కనీసం నలభై నిముషాలు గడువు కావాలి. 11.15కి నేను నువ్వు చెప్పిన ప్రదేశంలో వుంటాను.”

“మిస్టర్ షా, దీన్ని గురించి పోలీసులకు, లేక డిటెక్టివ్‌లకు ఏమాత్రం నువ్వు చెప్పినా ఆ కాగితం మినిస్టర్ ఫైల్లోకి వెళుతుంది. అటుపైన దాన్ని నువ్వు పొందే అవకాశం నీ జీవితంలో లభించదు.”

“మిస్టర్, నో ఫియర్స్. నేను మూర్ఖుడ్ని కాను.”

“ఆల్ రైట్, గుడ్ నైట్,” అని అతను రిసీవర్ని పెట్టేశాడు.

లత గ్లాసుల్లో మళ్లా విస్కీ పోసి, సోడాకలిపి ఐసు ముక్కలు వేసింది. అతడు గ్లాసును అందుకున్నాడు.

“బాస్, మన యూరోప్ ప్రయాణం ఎప్పుడు?” అందామె నవ్వుతూ.

“లతా, తొందరపడకు. యూరప్‌తో అమెరికా కూడా పర్యటించి వచ్చే అవకాశం నీకు కల్పిస్తాను.” అన్నాడతను.

ఆమె సంతోషంగా అతనిమీదకు వాలిపోయింది.

3

గుమ్మం బయట నిలబడి సుమతి బయటకు చూస్తోంది. రోడ్డుదీపాలు వెలుగుతున్నాయి. ఇప్పుడంతగా జన సంచారం లేదు.

“సుమతీ, ఇంకా ఎంతసేపు అలా చూస్తూ వుంటావు? వాడు ఎప్పుడో వస్తాడు. నువ్వు భోజనంచేసి వాడికి పదార్థాలన్నీ మూతపెట్టు” అంది అత్త సుందరమ్మ.

సుమతి తలుపులు మూసి గడియలు బిగించింది. హాల్లో లైటు వెలుగుతోంది. ఎనిమిదింటికే భోజనం చేసి జానకి నేలమీద పక్కేసి నిద్రపోతోంది. కూతురుపక్కనే తన

బొంతమీద యిటూ అటూ సుందరమ్మ దొర్లుతోంది.

సుమతి కడివైపున్న పడగ్గదిలోకి వెళ్ళలేదు. తన అత్తపక్కనే వేలమీద కూర్చుండిపోయింది.

"ఎందుకో బెంగగా వుందండి," అంది సుమతి.

"ఎందుకమ్మా బెంగ! ఇలా ఆలస్యంగా రావడం వాడికలవాటేగా?"

"అది కాదండి. ఇవాళ ఆఫీసునుంచి ఆయనింటికొచ్చారు. ఎందుకో అదోలా వున్నారు. దేన్నిగురించో ఆయన తీవ్రంగా ఆలోచిస్తున్నారు. వెళ్ళేముందు పది లోపల వస్తానని నాతో అన్నారు. పదకొండు అయినా యింకా రాలేదు."

"అబ్బాయి మళ్ళా ఆఫీసుకి వెళ్ళలేదా?"

"ఆఫీసుకి వెళ్ళుంటే నేనంత బెంగపడేదాన్ని కాను. మరెక్కడికో వెళ్ళాలన్నారు. చెల్లెలి పెళ్ళి దీనిమీద ఆధారపడుతుందన్నారు. ఎవరేనా డబ్బిచ్చారేమో! ఆ డబ్బు పట్టుకుని యింత రాత్రివేళ వస్తూంటే ప్రమాదం రావొచ్చు," అంది సుమతి.

వెంటనే సుందరమ్మ లేచి కూర్చుంది.

"ఎక్కడికెళ్ళాడంటావు?"

"అదే తెలీదండీ!"

సుందరమ్మ, సుమతి కొంతసేపు మౌనంగా కూర్చుండిపోయారు. సుమతి ఎస్. ఎస్. ఎల్. సి. పాసయింది. పెళ్ళయి ఆరేళ్ళయినా ఆమెకింకా పిల్లలేరు. ఏదో ఆలోచన తట్టినట్టు సుందరమ్మ కూతుర్ని లేపింది. జానకి నిద్రమత్తుతో కళ్ళు తెరచి వాళ్ళవైపు చూసింది.

"ఏమిటమ్మా, అప్పుడే లేపేశావు?" అంందామె విసుగ్గా.

"అమ్మాయ్, నీకింకా నిద్రమత్తు పోలేదు. వెళ్ళి మొహం కడుక్కునిరా. నీతో మాట్లాడాలి" అంది సుందరమ్మ.

జానకి మెల్లిగా బాత్ రూంలోకి వెళ్ళి మొహం కడుక్కుని తిరిగివచ్చింది. తల్లికెదురుగా వదిన పక్కనే కూచుంది.

"ఏవిటమ్మా?"

"బలరామ్ అన్నయ్య ఇంకా యింటికి తిరిగిరాలేదు."

"అంతేనా? అమాత్రం దానికి గాభరా ఎందుకమ్మా?" అని జానకి టేబులు మీదున్న గడియారంవైపు చూసింది.

పన్నెండు కావస్తోంది.

"వదినింకా భోజనం చేయలేదు" అంది సుందరమ్మ.

"వదినా, పద. నువ్వు భోంచెయ్యి. నేను సాయం కూర్చుంటాను. అన్నయ్య ఏ సినిమాకో వెళ్లుంటాడు. రెండు లోపల తప్పకుండా వస్తాడు."

"నాతో చెప్పకుండా మీ అన్నయ్య సినిమాకి వెళ్ళరు."

"ఇంతకీ ఆఫీసునుంచి యింటికి తిరిగొచ్చి అన్నయ్య ఎక్కడికెళ్ళాడు?"

"నీ పెళ్ళికి డబ్బు తేడానికి ఎక్కడికో వెళుతున్నానన్నారు. వివరాలు నాతో చెప్పలేదు."

జానకి తటాలున లేచి నిలబడింది. క్షణకాలం ఆలోచిస్తూ వుండిపోయింది.

"పక్కింట్లో వుండే అడ్వకేట్ రామాచారిగారితో మాట్లాడ్డం మంచిదేమో! అన్నయ్య ఆఫీసుకి ఫోన్ చేసి కనుక్కోవచ్చు" అంది జానకి.

"చేసి చూడు" అంది సుమతి.

ముందు తలుపు తెరుచుకుని జానకి బయటకు వెళ్ళింది. రోడ్డు నిర్మానుష్యంగా వుంది. పక్కనే వున్న తలుపును ఆమె తట్టింది. అడ్వకేట్ రామాచారి స్విచ్ ఆన్ చేసి తలుపు తెరిచాడు. ఆమె హాల్లోకి నడిచింది.

"ఏవిటమ్మా? నువ్వా!" అన్నాడు రామాచారి.

"రామాచారిగారూ, అన్నయ్య యింకా తిరిగిరాలేదు. ఆఫీసులో వున్నాడేమో అని నాకు అనుమానంగా వుంది. ఒకసారి ఫోన్ చేసి కనుక్కుంటారా?"

"నంబరెంతమ్మా?" అని అడిగి అతడు రిసీవరెత్తాడు.

ఆమె నంబరు చెప్పింది. అతడు రెండు మూడుసార్లు డయల్ చేసి చూశాడు.

"ఆఫీసులో ఎవరూ వున్నట్టులేదు. ఎవరూ రిసీవరెత్తడంలేదు" అన్నాడు రామాచారి.

ఏం చెయ్యాలో తోచక జానకి మౌనం వహించింది. ఆవులిస్తూ ఆమెవైపు చూశాడు రామాచారి.

"భయపడకండమ్మా, మంత్రిగారి ఆఫీసులో మీ అన్నయ్య సెక్రటరీగా వుంటున్నాడు. అతడికి అనేక పనులుంటాయి. కాస్సేపట్లో వస్తాడు."

రామాచారికి థాంక్స్ చెప్పి ఆమె తనింటికి తిరిగి వెళ్ళి పోయింది.

"అన్నయ్య ఆఫీసులో లేడమ్మా" అంది జానకి.

"ఆఫీసుకు వెళ్ళలేదని నేను మొదటే చెప్పానుగా?" అంది సుమతి.

"ఇంత రాత్రివేళ మనం చెయ్యగలిగిందేమీ లేదు. మరి కొంతసేపు చూసి తరవాత ఆలోచిద్దాం!" అని జానకి సలహా యిచ్చింది.

"అవునమ్మా నువ్వు భోజనంచేసి పడుకో. వాడు వస్తాడు. రాకపోతే చూద్దాం" అంది సుందరమ్మ.

సుమతి మౌనంగా లేచి పక్క గదిలోకి దూరింది. జానకి, తల్లి వాళ్ళ పక్కలమీద నిద్రమత్తుతో వాలి పోయారు. నిముషాలు గడిచిపోతున్నాయి.

పడగ్గదిలో లైటు వెలుగుతోంది. సుమతి నిద్రపట్టక యిటూ అటూ దొర్లుతోంది. భర్త మొహం ఆమెకు జ్ఞప్తికొస్తోంది. ఒక్కోసారి రాత్రంతా అతడు పనిమీద వుండిపోయేవాడు. కాని ముందుగా ఆమెతో చెప్పేవాడు. తనతో చెప్పకుండా అతడింత ఆలస్యం ఎన్నడూ చెయ్యలేదు. అతడికి ఏదేనా ప్రమాదం సంభవించిందా? ఏదైనా ఆక్సిడెంట్ అయిందా? ఏవేవో ఆలోచనలు ఆమె మెదడులో తిరుగుతున్నాయి. గుమ్మం దగ్గరకు వెళ్ళి ఆమె హాల్లోకి చూసింది. సుందరమ్మ, జానకి గాఢ నిద్రలో వున్నారు. హాల్లోని లైటుని ఆఫ్ చేసి ఆమె పడగ్గదిని చేరుకుంది. పడగ్గదిలోని లైటును తీసేసి పరుపు మీద పడుకుని భర్తను గురించే ఆలోచిస్తోంది.

4

టెలిఫోన్ రింగ్ విని లేచాను. పక్కనున్న స్విచ్ నొక్కాను. లైటు వెలిగింది. రిసీవరెత్తి, "హలో, పరశురామ్ స్పీకింగ్" అన్నాను. అటువైపు కంఠం ఇన్స్పెక్టర్ నాయర్ది.

"నాయర్ భాయ్, ఇవాళ నీ వైఫ్ బర్తడేగా? ఇంకా యింటికెళ్ళలేదా?" ప్రశ్నించాను.

"ఎక్కడిల్లు బ్రదర్? ఇప్పుడే ఒక శవాన్ని గురించి రిపోర్టు వచ్చింది. నేను శవం పడున్న స్థలానికి వెళ్ళి అంతా చూసి ఒక హోటలునుంచి నీకు ఫోన్ చేస్తు

న్నాను. నువ్వోసారి వస్తే బావుంటుంది" అన్నాడు నాయర్.

"ఎక్కడుంది శవం?"

"తుగ్లక్ రోడ్డువారగా పడుంది."

"ఆల్ రైట్ వస్తున్నా" అని రిసీవర్ పెట్టేశాను.

పరుపువిూంచి కిందకు దిగాను. సుఖనిద్రలో మునిగి వున్న పార్వతిలో ఏవేవో కొత్త అందాలు నాకు కనిపించాయి. ఆమె బుగ్గమీద సున్నితంగా ముద్దుపెట్టుకుని, ఇండియా కింగ్స్ సిగరెట్ వెలిగించి బయటకు నడిచాను. మెట్లు దిగాను. వరండాలో పడుకున్న క్రిష్ణయ్య నా బూట్ల చప్పుడు విని మేలుకున్నాడు. కారు షెడ్ వైపు వెళ్తూ తలుపేసుకోమని అతడ్ని హెచ్చరించాను.

డాడ్జి కారును గేటువైపు పోనిచ్చాను. వాచ్‌మన్ రాణా గేటు తెరచి నాకు శల్యూట్ చేశాడు. కారు రోడ్డమ్మట దూసుకుపోతోంది. డిజిటల్ వాచ్ చూశాను. టయిమ్ పదకొండూ యాభైమూడు అయింది. చల్లటి గాలి వీస్తోంది. రోడ్డమీద అక్కడక్కడ కొందరు తిరుగుతున్నారు. కుక్కలు మొరుగుతున్నాయి. తుగ్లక్ రోడ్డువేపు కారు తిప్పాను. చీకటిగా వుంది. రోడ్డులైటు వెలగడంలేదు. లైట్లను ఎవరో పగలగొట్టి వుంటారు. తుగ్లక్ రోడ్డు స్మగులర్స్‌కు రహదారని ప్రెస్ విలేఖర్లు రాస్తూంటారు.

పోలీస్ జీప్‌ను చూసి వెనుకనే డాడ్జికారును ఆపి దిగాను. పెట్రోమాక్సులైటు ప్రకాశవంతంగా వెలుగుతోంది. అరడజను మంది కానిస్టేబుల్సు నాకు కనిపించారు. ఇన్స్‌పెక్టర్ నాయర్ నావైపు వచ్చాడు. అతడితో కరచాలనం చేసి శవం పడున్న చోటుకి

వెళ్ళాను.

రోడ్డు వారగా పడున్న శవంవైపు చూశాను. శవం భయంకరంగా ఉంది. మొహం పచ్చబడయిపోయింది. పేగులు బయటకు వేళ్లాడుతున్నాయి. మోకాళ్లు, పాదాలు తలనుంచి కాళ్ళదాకా ఒళ్ళంతా నలిగిపోయ ముద్దయినట్లుంది. చిరిగిన అండర్ వేర్, బనియన్ వికృతంగా కనిపిస్తున్నాయి.

"హారిబుల్!" అన్నాను.

"బ్రదర్, బయట వూళ్ళనుంచి వచ్చే స్మగులర్స్ కార్లు ఈ రోడ్డమ్మట పట్నంలోకి వెళ్తూ వుంటాయి. ఏ కారో యితడ్ని క్రిందపడగొట్టి మాయమయి వుంటుంది. ఇదొక హిట్ అండ్ రన్ కేసు అయివుండాలి," అన్నాడు నాయర్.

జవాబివ్వకుండా రూపంలేని శవాన్ని పరీక్షిస్తూ వుండిపోయాను. అయిదు నిముషాల తరువాత శవానికి కొంచెం దూరంగా నడిచి సిగరెట్ వెలిగించి పొగ వదులూ ఇన్స్పెక్టర్ నాయర్ కేసి చుశాను.

"నాయర్ భాయ్ ఏ కారుకిందోపడి యితడు మరణించాడని స్పష్టంగా తెలుస్తోంది. అండర్ వేర్ బనియన్లో అతడు ఈ రోడ్డమ్మట ఎందుకు నడిచాడు? సాధారణంగా ప్రజలు ఈ రోడ్డును వాడరు." అన్నాను.

"అవును బ్రదర్. నువ్వు చెప్పింది నిజమే. ఇతను ఎవరో బికారయి వుండాలి." అన్నాడు నాయర్.

ఇన్స్పెక్టర్ నాయర్ వైపు సూటిగా చూశాను.

"నాయర్ భాయ్, శవాన్నిబట్టి యిది హిట్ అండ్ రన్ కేసు కాదని మనం ఊహించవచ్చు. ప్రమాదవశాత్తూ ఏ కారుకిందో యితను పడివుంటే; ఆ కారు దూసుకు

బోయుంటే శవం మరోవిధంగా వుండేది. శరీరంలో కొన్ని భాగాలు మాత్రం నలిగి వుండేవి. శవాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తే ఒక విషయం నీకు తెలుస్తుంది. ఇతడ్ని పడగొట్టిన కారు దూసుకుపోలేదు. వెనక్కు ముందుకు కదులూ శవాన్ని పచ్చడి చేసింది. అతడి ఎడంచేతి మీద రిస్టువాచ్ గుర్తులు ఉన్నాయి. కాని వాచ్ లేదు. అతని దుస్తులు లేవు అతడి కాళ్ళకు జోళ్ళు లేవు. నా దృష్టిలో ఇది యాక్సిడెంటు కాదు. కోల్డు మర్డర్!"

నాయర్ నావైపు ఆశ్చర్యంగా చూశాడు.

"నాయర్ భాయ్ యితని వస్తువులన్నీ ఎవరో పట్టుకు పోయుంటారు. పోల్చలేని స్థితిలో శవాన్ని రోడ్డువారగా వదిలేశారు. ఇతడెవరో మనం కనుక్కోవాలి. శవం ఎవరిదో తెలిస్తేగాని మనం ఏమీ చెయ్యలేం."

ఇన్స్పెక్టర్ నాయర్ తలాడించాడు. నా కారు వెనకనే మరో కారొచ్చి ఆగింది. డాక్టర్ సుధాకర్ మావైపు వచ్చాడు. ఇన్స్పెక్టర్ నాయర్ డాక్టర్ సుధాకర్‌తో శవంవైపు వెళ్ళాడు. రోడ్డమ్మట చీకట్లో కొంతదూరం నడిచాను. రోడ్డువారగా వున్న స్తంభంవేపు చూశాను. ఆగాను. జేబులోంచి టార్చితీసి బటన్ నొక్కాను. టార్చికాంతిలో పైకిచూశాను. పైన అమర్చిన ఫ్లోరసెంట్ ట్యూబ్ పగిలి వుంది. టార్చిని జేబులో వేసుకుని వెనక్కి తిరిగాను. ఆలోచిస్తూ నడుస్తున్నాను. స్మగులర్స్‌కి చీకటి రోడ్లు కావాలి. రోడ్లలైట్లను ధ్వంసం చేసి వాళ్ళు చీకటిని సృష్టించుకుంటారు.

డాక్టర్ సుధాకర్ శవాన్ని పరీక్షిస్తున్నాడు. డాడ్జి కారుపక్కనే నిలబడి మరో సిగరెట్టు వెలిగించాను. కాసేపట్లో ఇన్స్పెక్టర్ నాయర్, డాక్టర్ సుధాకర్ నాదగ్గర

కొచ్చారు.

"పరశురామ్‌గారూ, ఇతడు మరణించి ఓ గంట పైన దాటివుంటుంది. శవాన్ని చూస్తే ఎన్నో కార్లు దానిమీద నుంచి వెళ్ళిపోయుండాలనిపిస్తోంది" అన్నాడు డాక్టర్ సుధాకర్.

తలుపులు తెరిచి స్టీరింగ్ వీలు వెనుక కూర్చున్నాను. డాక్టర్ సుధాకర్‌కి గుడ్‌నైట్ చెప్పి నాయర్ వైపు చూశాను.

"నాయర్ భాయ్ శవాన్ని మార్చ్యురీకి పంపించు. ఎవరో దాన్ని గుర్తించొచ్చు. తరువాత చెయ్యగలిగింది చూద్దాం."

"అలాగే బ్రదర్" అన్నాడు నాయర్.

ఇన్స్‌పెక్టర్ నాయర్‌కి గుడ్‌నైట్ చెప్పి, డాడ్జి కారును తుగ్లక్ రోడ్డువైపు పోనిచ్చాను.

5

హాల్లో సుమతి ఏడుస్తూ కూర్చుని వుంది. జానకి సుందరమ్మ పక్కనే కూర్చుని ఏడుస్తున్నారు. అడ్వకేట్ రామాచారి కుర్చీలో కూర్చుని వున్నాడు.

"నిన్న రాత్రి బలరామ్ ఎక్కడికెళ్ళాడో కాని అతడీవేళ తన ఆఫీసుకి హాజరు కాలేదు. ఫోన్ చేసి కనుక్కున్నాను. బలరామ్ గురించి పోలీసు రిపోర్టు కూడా యిచ్చాను" అన్నాడు రామాచారి.

"అన్నయ్య ఏ ఊరైనా వెళ్ళాడేమో" అంది జానకి.

"ఇంట్లోవాళ్ళకి చెప్పకుండా ఆయన వెళ్ళరు" అంది సుమతి.

బయట పోలీస్ జీప్ ఆగింది. రామాచారి గుమ్మం వైపు పరుగెత్తాడు.

సబ్ ఇనస్పెక్టర్ రామన్ జీపులోంచి దిగి రామాచారి వైపు చూశాడు.

"మిస్టర్ బలరామ్ యిల్లు ఇదేనా?"

"అవును" అన్నాడు రామాచారి.

"ఆయన మాయమయినట్లు మీరు రిపోర్టు యిచ్చారా?"

"రిపోర్టు నేనే యిచ్చాను. నా పేరు రామాచారి."

"మీరు మాతో రండి."

"బలరామ్ దొరికాడా?"

"ఆయన మీ కేమవుతాడు?"

"నేను పక్కింట్లో వుంటున్నాను. బలరామ్‌కి భార్యా, తల్లీ, ఒక చెల్లెలూ వున్నారు. వాళ్ళు ఈ యింట్లో వుంటున్నారు."

"రామాచారిగారూ, నిన్న రాత్రి కారు ఏక్సిడెంట్‌లో మరణించిన ఒక వ్యక్తి శవం రాయపేట హాస్పిటలులో వుంది. ఆ శవాన్ని యింతవరకూ ఎవరూ పోల్చలేదు. మీరొకసారొచ్చి ఆ శవాన్ని చూడ్డం మంచిది."

"ఉండండి, యిప్పుడే వస్తాను" అని రామాచారి లోపలకు వెళ్ళాడు.

అరగంట దాటింది. ఒక కానిస్టేబులు శవాన్ని కప్పిన గుడ్డను తొలగించాడు. రామాచారి శవాన్ని చూశాడు. ఆ శవం ఎవరిదో అతడికి తెలీలేదు. సుందరమ్మ శవాన్ని చూసి కళ్ళుమూసుకుంది. జానకి భయంతో శవాన్ని పరిశీలిస్తోంది. వెక్కి వెక్కి ఏడుస్తూ సుమతి శవం మీద వాలి పోయింది. సబిన్స్పెక్టర్ రామన్ ఆమె దగ్గరకు జరిగాడు.

"ఈ శవం బలరామ్ గారిదేనా?"

సుమతి జవాబివ్వలేదు. శవం మీద పడి పిచ్చిగా ఏడు

స్తోంది.

"ఊరుకో వదినా. ఈ శవం అన్నయ్యది కాదు," అంది జానకి.

"ఆయనదే" ఘొల్లున అరిచింది సుమతి.

సబిన్స్పెక్టర్ రామన్ వాళ్ళందర్నీ బయటకు తీసుకు పోయాడు. కాన్స్టేబుల్లో వాళ్ళందరూ ఇంటికి చేరుకున్నారు.

* * *

ఇన్స్పెక్టర్ నాయర్ కి ఎదురుగా కుర్చీలో కూర్చుని సిగరెట్ వెలిగించాను.

"నాయర్ భాయ్ ఏదైనా తెలిసిందా?"

"ఇంతవరకూ ఏదీ తెలియలేదు. అన్ని పోలీస్ స్టేషన్లకు క్రితం రాత్రి దొరికిన శవంగురించి వార్త పంపాం. తమ చుట్టాలెవరేనా మాయమయ్యారని రిపోర్టు యిచ్చిన వాళ్ళను తీసుకెళ్ళి చూపించమన్నాం."

టేబులుమీదున్న టెలిఫోన్ మ్రోగింది. రిసీవరెత్తి నాయర్ మాట్లాడసాగాడు. అతని మాటల్ని వింటూంటే నాలో ఉత్సాహం ఉరకలు వేస్తోంది.

రిసీవర్ని పెట్టేసి ఇన్స్పెక్టర్ నాయర్ నావైపు విజయవంతంగా చూశాడు.

"బ్రదర్ సబిన్స్పెక్టర్ రామన్ ఫోన్ చేశాడు. ఆ శవం బలరామ్ అనే వ్యక్తిది. బలరామ్ మాయమయ్యాడని ఇవాళ పొద్దుటే వాళ్ళు రిపోర్టు యిచ్చారు. సబిన స్పెక్టర్ రామన్ వాళ్ళను తీసుకెళ్ళి శవాన్ని చూపించాడు. సుమతి తన భర్త శవాన్ని వెంటనే పోల్చ గలిగింది."

"గుడ్ బ్రేక్!" అన్నాను.

"బలరామ్‌ది చిన్న కుటుంబం. తల్లి పేరు సుందరమ్మ. జానకి చెల్లెలు. భార్య పేరు సుమతి. నిన్న రాత్రినుంచీ అతను కనపడ్డంలేదుట."

కుర్చీలోంచి లేచాను.

"వాళ్ళ ఇంటి అడ్రసు కనుక్కున్నావా?"

"నంబరు 12, రాజాస్ట్రీట్, తేనాంపేట."

"నాయర్ భాయ్, నేనక్కడికి వెళ్ళి మాట్లాడతాను. బై బై," అని బయటకు పరుగెత్తాను.

ఒక చిన్న ఇంటిముందు కారాపి దిగాను. ముందు తలుపుమీద పన్నెండు నంబరు కొట్టొచ్చినట్టు కని పిస్తోంది. పక్కనే వున్న మరో తలుపుమీద 12 ఎ నంబరుంది. గోడమీద అడ్వొకేట్ రామాచారి బోర్డు తగిలించబడి వుంది. పన్నెండో నంబరింట్లోకి ప్రవేశించాను. హాల్లో ఆడవాళ్ళు మాత్రం వున్నారు. ముగ్గురూ ఏడుస్తున్నారు. ముసలామె బలరామ్ తల్లయివుండాలి. బలరామ్ భార్యనీ, చెల్లెల్ని క్షణంలో పోల్చగలిగాను. ఇరుగు పొరుగువాళ్ళు వాళ్ళను ఓదారుస్తున్నారు.

గదిలో కొచ్చిన నావైపు జానకి విచారవదనంతో చూసింది.

"మీరు అన్నయ్య ఆఫీసునుంచి వస్తున్నారా?"

కాదని తలాడించి ఆమెకు నా పేరు చెప్పాను. గోడ వారగా వున్న కుర్చీని నావైపు లాగి ఆమె కూర్చోమంది. నా ఎదురుగా నేలమీద చతికిలబడి ఆమె వెక్కి వెక్కి ఏడవసాగింది. ఆమెవైపు జాలిగా చూశాను. ఆమె వయస్సు ఇరవై దాటి వుండదు. పచ్చగా అందంగా ఉంది.

"ఆ శవం మీ అన్నయ్యదేనా?"

"పరశురామ్‌గారూ, అన్నయ్య మరణించాడంటే నేను నమ్మలేకుండా వున్నాను. మొదట్లో అన్నయ్యది కాదనుకున్నాను. కాని వదిన వెంటనే పోల్చగలిగింది. కొంతసేపయ్యాక అమ్మ కూడా అన్నయ్యదేనంది. ఆ శవం అన్నయ్యదని చివరకి నాకు కూడా నమ్మకం ఏర్పడింది!"

"మీ అన్నయ్య ఎక్కడ పనిచేస్తున్నాడు?"

"మినిస్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్ ఆఫీసులో నలుగురు సెక్రటరీలున్నారు. అందులో ఒక సెక్రటరీ మా అన్నయ్య."

"ఆ ఆఫీసునుంచి ఎవరేనా యిక్కడికి వచ్చారా?"

"ఎవరూ రాలేదు!"

"నిన్న మీ అన్నయ్య ఆఫీసునుంచి ఇంటికొచ్చాడా?"

"ఆరింటికొచ్చాడు. దీన్ని గురించి వదిన మీతో ఎక్కువగా చెప్పగలదు," అంది జానకి.

గోడవారగా కూర్చున్న సుమతివైపు చూశాను. ఏడుస్తూన్న ఆమె కళ్ళు నావైపు తిరిగాయి.

"నిన్న రాత్రి యింటికొచ్చినప్పుడు బలరామ్ ఎలా వున్నాడు?"

ఆమె జవాబివ్వలేదు. వెక్కి వెక్కి ఏడవసాగింది. జానకి వదిన దగ్గరగా జరిగింది.

"వదినా పరశురామ్‌గారికి అంతా చెప్పు. అన్నయ్య ఈ దుస్థితి కెలా వచ్చాడో ఆయన కనుక్కుంటారు."

సుమతివైపు జాలిగా చూశాను.

"ఆయన మామూలుగా లేరు; ఎందుకో గాభరాగా వున్నారు. పెన్‌కోసం ఆయన ప్లాస్టిక్ బాగ్‌ను నేను తెరిచాను. తటాలున ఆయనొచ్చి బాగ్‌ను లాక్కున్నారు. దాన్ని ముట్టుకోవద్దన్నారు. అందులో ఏవో ముఖ్య

మయిన కాగితాలున్నాయన్నారు."

"ఇంటి కొచ్చి అతను ఎక్కడికెళ్ళాడు?"

"ఎక్కడికెళ్ళారో నాకు తెలీదు. ఏడు గంటలు దాటాక వెళ్ళారు. పదిలోపల తిరిగి వస్తానన్నారు. జానక్కి ఈ మధ్యనే ఒక సంబంధం కుదిరింది. డబ్బు చేతికొచ్చాక పెళ్ళి చెయ్యాలని ఆయన ఉద్దేశం. నిన్న రాత్రి వెళ్ళిన పనిమీద జానకి పెళ్ళి ఆధారపడి వుందని ఆయన నాతో అన్నారు."

క్షణకాలం సిగరెట్ వెలిగిస్తూ ఆలోచిస్తూ వుండి పోయాను. నా మెదడులో ఆలోచనలు సాగుతున్నాయి. చెల్లెలి పెళ్ళి, బాగ్ లో ముఖ్యమయిన కాగితాలు, ఇదంతా విచిత్రంగా వుంది.

"ఎవరేనా యిక్కడికొచ్చి అతడ్ని కలుసుకుంటూ వుండేవారా?"

"ఎవరూ ఇక్కడికి వచ్చేవాడు కాదు. రాత్రిళ్ళు ఆయనకోసం ఈ మధ్య ఫోన్ కాల్సు తరుచు వస్తూ వుండేవి."

"ఫోన్ ఎక్కడుంది?"

"అడ్వకేట్ రామాచారిగారింట్లో ఫోన్ వుంది. రామాచారిగారు పదిదాకా ఇంటికి రారు. ఏదేనా ఫోన్ కాల్ వస్తే ఆయన భార్య నన్ను పిలిచేది. నే చెప్తే ఆయన వెళ్ళి మాట్లాడేవారు."

"నిన్న వెళ్ళినప్పుడు అతడు ఏ డ్రస్ లో వున్నాడు?"

"బ్లూ పాంట్, లైట్ బ్లూ స్లాక్, చేతికి సిటిజన్ ఆటోమాటిక్ వాచ్ వుండేది. కుడిచేతి వేలికి వెంక టేశ్వరుడి బొమ్మవున్న వుంగరం వుండేది. నల్లటి బాగ్ పట్టుకుని ఆయన బయటకు వెళ్ళారు. ఆయన రోడ్డుమీద

పడుండగా ఎవరో అవన్నీ పట్టుకుపోయూంటారు," అంది సుహాతి.

"పరశురామ్‌గారూ, శవాన్ని చూసి జాలిపడేవారు కొందరయితే శవం వస్తువులను దోచుకునేవారు కొందరుంటారు ఈ లోకంలో," అంది జానకి.

కుర్చీలోంచి లేచాను. వాళ్ళవైపు క్షణకాలం చూసి వెనక్కు తిరిగాను. గబగబా బయటకు నడిచాను. కారులో కూర్చుని తలుపు మూశాను. సిగరెట్ వెలిగించి కారును వేగంగా పోనిచ్చాను.

మినిస్టర్ ఫర్ ఇండస్ట్రీస్ ముఖ్య కార్యదర్శి అయిన వేణుగోపాల్ ఎదురుగా కూర్చున్నాను. అతను చాలా ఉదారయిన వ్యక్తి.

"మిస్టర్ బలరామ్ గురించి మీరేం చెప్పగలరు?" ప్రశ్నించాను.

అతడు నావైపు ఆశ్చర్యంగా చూశాడు.

"పరశురామ్‌గారూ, బలరామ్ రాకకోసం నేను పొద్దుట్నించీ ఎదురు చూస్తున్నాను. ఎందువలనో అతనింత వరకూ రాలేదు!"

"మిస్టర్ వేణుగోపాల్, బలరామ్ ఇక్కడికి రాలేడు. నిన్నరాత్రి అతడు మరణించాడు."

వేణుగోపాల్ అమాంతంగా కుర్చీలోంచి లేచాడు.

"బలరామ్ మరణించాడా? ఎలా?"

అతడివైపు సూటిగా చూశాను.

"అది ఏక్సిడెంట్ కావచ్చు, హత్య కావచ్చు. ప్రస్తుతం చెప్పలేను."

వేణుగోపాల్ జీవంలేనట్టు కుర్చీలో కూలిపోయాడు.

"పరశురామ్‌గారూ, ఏంచెయ్యాలో తోచడంలేదు.

ఒక ఫైల్లోంచి అతి ముఖ్యమయిన పత్రం మాయమయింది. మంత్రిగారు ఆ పత్రం కోసం మూడుసార్లు నాతో మాట్లాడారు. బలరామ్ వచ్చాక పట్టుకొస్తానని ఆయనతో చెప్పాను. ఇప్పుడా పత్రం ఎక్కడుందో తెలుసుకోడం సాధ్యంకాదు. మంత్రిగారు నన్ను ఎడా పెడా తిడతారు."

"మిస్టర్ వేణుగోపాల్ ఆ పత్రం ఏమిటి?"

"దాన్ని గురించి నేను చెప్పలేను సార్! అది చాలా రహస్యమైనది. అదుంటేగాని ఆ దుర్మార్గుడ్ని ఎవ్వరూ ఏదీ చెయ్యలేరు."

"ఎవరా దుర్మార్గుడు?"

టేబులుమీదున్న టెలిఫోన్ మ్రోగింది. రిసీవరెత్తి వేణుగోపాల్ మాట్లాడి, రిసీవర్ని పెట్టేసి నావైపు చూశాడు.

"పరశురామ్‌గారూ, దయచేసి మీరిక్కడే ఉండండి, క్షణంలో వస్తాను," అని అతను బయటకు పరుగెత్తాడు.

కాస్సేపట్లో వేణుగోపాల్ తిరిగొచ్చాడు. కుర్చీలో కూర్చుని నా చెయ్యిపట్టుకున్నాడు. అతని కళ్ళల్లో నీళ్ళు నిండాయి.

"పరశురామ్‌గారూ మీరు నాకు సహాయపడాలి. జీడిపిక్కలావుండే బలరామ్ ఇంత హఠాత్తుగా మరణించడం అసహజంగా వుంది. ఫైల్లోంచి మాయమయిన పత్రానికీ, అతడి చావుకూ ఏదో సంబంధముందని నా అనుమానం. మీకంతా వివరంగా చెప్తాను. ఏం జరిగిందో మీరు కనుక్కుంటే సంతోషిస్తాను."

"చెప్పండి."

"రంజిత్ షా గురించి మీరు వినే ఉండారు, అతడు

రాష్ట్రప్రభుత్వాన్ని ఘోరంగా మోసంచేసి కొన్నికోట్లు సంపాదించాడు. ఫోర్జరీ చేసిన పత్రంతో అతడు ఈ రాష్ట్ర ప్రభుత్వాన్ని మోసం చేశాడు. ఫోర్జరీ చేసిన ఆ పత్రం ఈ మధ్యనే మాకు చిక్కింది. దాని ఆధారంగా అతడిమీద యేక్షన్ తీసుకోవాలని మంత్రిగారి ఉద్దేశం. ఇప్పుడా పత్రం మాయమయింది. బలరామ్‌ని నమ్మించి బ్రెయిన్ వాష్ చేసి వుండొచ్చు. అతడు దేవాంతకుడు. తన స్వార్థం కోసం ఎంత మందినైనా తుదముట్టిస్తాడు."

"మిస్టర్ వేణుగోపాల్, బలరామ్ ఎటువంటివాడు?"

"బలరామ్ మంచివాడు. లంచాలు తీసుకునే తత్వం కాదు. కాని కొన్ని పరిస్థితుల్లో మంచివాళ్ళు మారుతూ వుంటారు. ధనపిశాచానికి తల వంచవలసి వస్తుంది."

కుర్చీలోంచి లేచాను. వేణుగోపాల్కి బై బై చెప్పి బయటకు నడిచాను. స్టీరింగ్ వీలు వెనుక కూర్చుని తలుపు మూసి సిగరెట్టు పొగపీల్చి వదులుతూ తీవ్రంగా ఆలోచిస్తూ వుండిపోయాను. కోటీశ్వరుడు రంజిత్ షాను క్రితం రాత్రి బలరామ్ కలుసుకుని ఆ పత్రాన్ని అతడికి యిచ్చాడా? చెల్లెలి పెళ్ళి తొందరగా చెయ్యాలనే ఉబలాటం మూలంగా బలరామ్ డబ్బుకోసం అడ్డదారి తొక్కవలసి వచ్చిందా?

ఆలోచిస్తూ కారును పోనిచ్చాను.

6

రంజిత్ షాకు ఫోన్ చేశాను. అతడి సెక్రటరీ మిస్ మూసా కమ్మటి కంఠంతో, "హలో!" అంది.

"పరశురామ్ హియర్" అన్నాను.

"మిస్టర్ పరశురామ్, మీతో మాట్లాడుతున్నందుకు ఆనందంగా వుంది. ఏం కావాలో చెప్పండి" అందామె.

"రంజిత్ షాతో మాట్లాడాలి."

"జస్టు ఎ మోమెంట్ ప్లీజ్!"

కాస్సేపయ్యాక పురుష కంఠం అటువైపునుంచి వినబడింది.

"మిస్టర్ పరశురామ్, మీరు నాకు ఫోన్ చేయడం ప్లెజెంట్ సర్ప్రైజ్!"

"మీతో మాట్లాడాలి!"

"వెల్కమ్ టూ మై ఫ్లాట్ యిన్ రంజిత్ మాన్షన్స్! ఇవాళ రాత్రి తొమ్మిది తర్వాత నేను ఫ్రీగా వుంటాను. మనం ఎంతసేపైనా స్కాచ్ సేవిస్తూ మాట్లాడుకోవచ్చు."

"ఆల్ రైట్, తొమ్మిదింటికి వస్తాను" అని రిసీవర్ పెట్టేశాను.

సిగరెట్ పీలుస్తూ సోఫాలో కూర్చున్నాను. టెలిఫోన్ మ్రోగింది.

"హలో, పరశురామ్ హియర్" అన్నాను.

"నాయర్ స్పీకింగ్! బ్రదర్ ఏదేనా తెలిసిందా?"

"రాత్రి తొమ్మిదింటికి రంజిత్ షాను కలుసుకోబోతున్నాను."

"బలరామ్ మరణంతో అతడికేదేనా సంబంధముందా?"

"వుంటే తెలుస్తుంది."

"బ్రదర్, అతడొక ఇంటర్నేషనల్ క్రూక్ అని విన్నాను. కాని ఎవరికీ దొరకడు. ఎనిమిదో అంతస్తులో వున్న ఫ్లాట్లో కావలసిన వాళ్ళను కలుసుకుంటూ వుంటాడు. అక్కడనుంచి బయటపడ్డం అంత సులువు కాదు!" అన్నాడు నాయర్.

"డోంట్ బాదర్! నేనక్కడ వుండడం రంజిత్ షా ఆరోగ్యానికి సుంచిదికాదు. అతి డే నన్ను సంతోషంగా సాగనంపుతాడు."

"శవ పరీక్ష అయింది. నువ్వు అన్నట్లు అది కోల్డు మర్డర్!"

"నాయర్ భాయ్, చూద్దాం. రంజిత్ షాతో మాట్లాడాక నీకు ఫోన్ చేస్తాను" అని రిసీవర్ పెట్టేశాను.

ఎనిమిదో అంతస్తులో వున్న ఫ్లాట్‌కు లిఫ్ట్‌లో వెళ్లాను. లిఫ్ట్‌లోంచి నడవమీదకు నడిచాను. మిస్ మూసా నవ్వుతూ నన్ను ఆహ్వానించింది.

మిస్ మూసా వయస్సు యిరవై రెండేళ్లు వుంటుంది. ఆమె గోవానీస్ యువతి. చాలా అందంగా వుంటుంది.

"మిస్టర్ పరశురామ్, వెల్కమ్!" అందామె.

ఆమె వెనకనే వెళ్ళాను. ఒక తలుపును ఆమె తోసింది. నేను లోపలకు వెళ్ళాను. విశాలమైన హాలు. ఇంద్ర భవనంలా వుంది. రంజిత్ షా కోటీశ్వరుడని యీ హాలు ప్రకటిస్తోంది.

రంజిత్ షా అమెరికన్ సూటులో అఖండంగా వున్నాడు. సన్నగా పొడుగ్గా వున్నాడు. జుత్తు బాగా తెల్లబడింది. అతడు వుషారుగా నాతో కరచాలనం చేసి కూర్చోమన్నాడు.

అరడజను ఫ్లోరసెంట్ లైట్లు వెలుగుతున్నాయి. ఫోమ్ సోఫాలో కూర్చున్నాను. పక్కనే అతడు చతికిల బడ్డాడు. మిస్ మూసా ఎదురుగావచ్చి నిలబడింది.

"మిస్ మూసా, డ్రింక్స్ ప్లీజ్! మిస్టర్ పరశురామ్, మిస్ మూసా నా కుడి చెయ్యి. ఆమె లేకుండా ఇక్కడ ఏ పనీ సాగదు" అన్నాడతను,

మిస్ మూసా కాస్సేపట్లో తిరిగివచ్చింది. మాముందున్న టీపాయ్‌మీద రెండు గ్లాసులు పెట్టింది. రాయల్ సెల్యూట్ విస్కీ గ్లాసుల్లో పోసి. ఐస్ క్యూబ్స్ పడేసి, సోడా కలిపింది. ఇద్దరం గ్లాసులందుకున్నాం.

"ఛియర్స్" అన్నాడు రంజిత్ షా.

"ఛియర్స్" అన్నాను నవ్వుతూ.

కొంచెం దూరంగా జరిగి టేబులు వెనుకనున్న కుర్చీలో మిస్ మూసా కూర్చొని ఏదో ఫైలు తిరగేస్తోంది.

"మిస్టర్ పరశురామ్, ఇలా మీరు రావడం నా హృదయాన్ని ఆనందంతో నింపింది" అన్నాడతను.

"నేనొచ్చిన పని తెలిశాక మీరంత ఆనందించరేమో!" అన్నాను నవ్వుతూ.

"నాతో పనా? ఏమిటో చెప్పండి!"

"బలరామ్!" అన్నాను క్లుప్తంగా.

అతడు నావైపు ఆశ్చర్యంగా చూశాడు. గ్లాసులోని విస్కీని కొంచం త్రాగాడు.

"బలరామ్ ఎవరో నాకు తెలీదు!"

"మిస్టర్ షా అతను మీకు బాగా తెలుసు. మినిస్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్ ఆఫీస్‌లో అతను సెక్రటరీగా పనిచేసేవాడు. మీకు అతి ముఖ్యమయిన పత్రాన్ని నిన్నరాత్రి పట్టుకొచ్చి అందించాడు. ఆ తర్వాత అతను యింటికి చేరుకోలేదు!"

"ఎక్కడకు పోయాడు?"

"అది మీకు తెలిసుండొచ్చని యిలా వచ్చాను."

అతడు గ్లాసు ఖాళీచేశాడు. పక్కనే నా ఖాళీ గ్లాసుంది.

"మిస్ మూసా, ప్లీజ్!" అన్నాడతను.

డ్రింక్ పోసి ఆమె వెళ్ళిపోయింది.

"మిస్టర్ పరశురామ్. అతడు నన్ను కల్సుకోలేదు. అతడి కోసం మీరు రాంగ్ ప్లేస్‌లో వెతుకుతున్నారు!"

"మిస్టర్ షా, ప్రభుత్వం ఫైల్లో మీకు సంబంధించిన పత్రం లేదు!"

"మన ప్రభుత్వానికి ఫైల్సును జాగ్రత్తగా చూసుకునే అలవాటు లేదని మనం అనుకోవాలి!"

"జాగ్రత్తగా వుంచుకున్న ఫైల్సునుంచి పత్రాలను ఎగరేసుకుపోయే నేర్పరితనం కొందరికుందని కూడా మనం అనుకోవచ్చు!"

అతడు సూటిగా నావంక చూశాడు.

"మిస్టర్ పరశురామ్, నా ఆస్తి, హోదాచూసి అనేకమంది యీర్ష్యతో ఏడుస్తారు. నా గురించి కంప్లెయింట్లు ప్రభుత్వానికి పంపుతూ వుంటారు. కాని ఏదీ చేతికి చిక్కక ప్రభుత్వం వూరుకుంటుంది."

"ఆ పత్రం మీకు చేరిందా?"

"నాకు అందలేదు. ఎవడో దాన్ని కొట్టేసివుండొచ్చు. వాడు నా దగ్గరకొస్తే మీకు ఫోన్ చేస్తాను."

గ్లాసులోని విస్కీ తాగేసి తటాలున లేచాను.

"మిస్టర్ రంజిత్ షా, బలరామ్ మర్డర్ చేయబడ్డాడు. మర్డర్ చార్జి మీద మిమ్మల్ని అరెస్టు చేయక తప్పదు!"

అతడు ఉలిక్కిపడ్డాడు. మిస్ మూసా టేబులు వైపు వెళ్ళాను. టేబులుమీద ఫోనుంది. రిసీవర్ ఎత్తాను. రంజిత్ షా వేగంగావచ్చి నా చెయ్యి పట్టుకున్నాడు.

"మిస్టర్ పరశురామ్, ఎక్కడకు ఫోన్ చెయ్యాలి?"

"రోడ్డుమీద పోలీస్ జీప్ సిద్ధంగా వుంది. ఇన్స్పెక్టర్ నాయర్ ఒక ఫోన్ దగ్గర నా కాల్ కోసం ఎదురుచూస్తూ వుంటాడు."

"తొందరపడకండి! మనం మాట్లాడాలి!"

రిసీవర్ని పెట్టేశాను. ఇద్దరం సోఫాలో కూర్చున్నాం.

"మిస్టర్ పరశురాం, నేను హంతకుడిని కాను. కాని యీ సమయంలో మీతో ఒకటి చెప్తాను. అతడు బలరామ్ హంతకుడు కావచ్చు!"

"ఎవరతను?"

"అతడెవరో నాకు తెలియదు. నాకు సంబంధించిన పత్రం అతడివద్ద వుందన్నాడు. పదిలక్షలు యిస్తే నాకిస్తా అన్నాడు."

"అతను ఎప్పుడు ఫోన్ చేశాడు?"

"నిన్న రాత్రి 10-30కి నన్ను డబ్బుకోరమ్మన్నాడు. బీచ్‌లో గాంధీ విగ్రహం దగ్గర నన్ను నిలబడమన్నాడు. తను కారులో వస్తానన్నాడు."

"మీరు వెళ్ళారా?"

"లేదు. బ్లాక్ మెయిలర్‌కి తలొంచడం నాకిష్టంలేదు. ఆ పత్రం నాకొద్దన్నాను."

"ఈ మహాపట్నంలో అతడెవరో ఎలా కనుక్కోగలం?"

రంజిత్ షా కొంతసేపు ఆలోచించాడు.

"అతడి ఫోన్ నెంబరు చెప్పగలను?"

"అదెలా కనుక్కోగలారు?"

"నేను మాటాడుతూండగా మిస్ మూసా ఎక్స్ఛేంజ్‌కి ఫోన్ చేసి కనుక్కొంది."

"నంబరు చెప్పండి."

అతడు సౌజ్ఞ చేశాడు. ఒక కాగితం మీద ఆమె నంబరు రాసి యిచ్చింది. నంబరు చూసి, చీటీని జేబులో పడేసుకున్నాను. అతడివైపు సూటిగా చూశాను.

"ఇది అబద్ధమైతే మీరు కష్టంలో పడ్తారు!"

అతడు తీయగా నవ్వాడు.

"పరశురామ్‌గారూ, తెలుసుకున్నాక మీరు నాకు ఫోన్ చేసి థాంక్స్ చెప్తారు."

అతడికి బై బై చెప్పి బయటకు నడిచాను. మిస్ మూసా నాతో లిఫ్ట్ దాకా వచ్చింది.

7

డాడ్జికారును వేగంగా పోనిస్తున్నాను. వెనకనే పోలీస్ జీప్ వస్తోంది. టైమ్ చూశాను. పన్నెండు కావస్తోంది.

గేటు మూసివుంది. గూర్ఖా ముందు పచార్లు చేస్తున్నాడు. తలుపు తెరవమని అర్చాను. అతడు నాదగ్గరగా వచ్చాడు.

"పోలీస్, ఓపెన్!" అర్చాను.

అతడు వెనకనున్న పోలీస్ జీప్‌నుచూసి పరుగెత్తుకెళ్ళి గేటు తెర్చాడు. కారును లోపలకు పోనిచ్చి మేడముందు ఆపి దిగాను. ముందు హాల్లోకి పరుగెత్తాను. హాల్లో లైట్లు వెల్గుతున్నాయి. ఎవ్వరూ లేరు. ఇన్స్‌పెక్టర్ 'నాయర్' కానిస్టేబుల్సు వెనకనే వస్తున్నారు.

కుడివైపున్న తలుపుతోసి లోపలకు వెళ్ళాను. నా వెనకనే ఇన్స్‌పెక్టర్ నాయర్ వచ్చాడు. రొటేటింగ్ కుర్చీలో కూర్చున్నతను అమాంతంగా లేచాడు.

"ఏమిటిదంతా?" అన్నాడతను.

అతడివైపు సూటిగా చూశాను. కిరాతకుడిలా

వున్నాడు. అతను టేబుల్ సొరుగులాగబోయాడు. నా పిస్టల్ని అతడివైపు గురిపెట్టాను. "చేతులెత్తు!" అర్చాను.

అతడు చేతులెత్తాడు. దగ్గరగా వెళ్ళాను.

"బలరామ్ ఏమయ్యాడు?" అడిగాను.

"నాకు తెలియదు."

"రంజిత్ షా అంతా చెప్పాడు," అన్నాను.

అతడు త్రుళ్ళిపడ్డాడు. తటాలున బూట్‌తో అతడిని తన్నాను. అతడు వెనక్కి పడ్డాడు. పరుగెత్తుకెళ్ళి అతడిని మళ్ళా తన్నాను. అతను దొర్లుతూ పక్కకిపడ్డాడు. వెల్లకిలా పడుకుని నావైపు చూశాడు.

"బలరామ్ ఎవరో నాకు తెలీదు. రంజిత్ షా పేరు అంతకంటే తెలీదు. నేను ధర్మంగా వ్యాపారం చేసుకుని బతుకుతున్నాను. జయంతీ ఇండస్ట్రీస్ బోర్డు మీరు బయట చూసే వుంటారు," అని అతను లేచి కూర్చున్నాడు.

ముందుకు వంగాను. అతని చెంపలు డప్పుల్లా మ్రోగాయి. నోట్లోంచి రక్తం కారుతోంది.

"బాస్టర్డు బలరామ్ ఎవరో తెలీకుండా రంజిత్ షాకి ఆ పత్రం ఎలా అమ్మావు?"

అతడు భయంతో నావైపు చూశాడు.

"రంజిత్ షా ఎవరికీ చెప్పనన్నాడు. అయిదు లక్షలిచ్చి ఆపత్రాన్ని నా దగ్గర్నించి కొన్నాడు. బలరామ్ నన్ను కలుసుకున్నాడు. నేనతనికి యిరవై అయిదు వేలిచ్చాను. అది పట్టుకుని అతడు వెళ్ళిపోయాడు. అతనేమయ్యాడో నాకు తెలీదు."

"నీకు తెలుసు. నీ కారుకింద నలిగి నలిగి అతను కుక్కలా చచ్చాడు. నువ్విచ్చిన డబ్బంతా నీకు మళ్ళా

చేరుంటుంది!"

"అబద్ధం!........"

బూటుకాలు పైకెత్తాను.

"ప్లీజ్, నన్ను చంపకండి. అతడ్ని నేనే చంపిం చాను!"

వెనక నిలబడిన ఇన్స్పెక్టర్ నాయర్ అతని చేతికి బేడీలు వేశాడు. వెనక్కి తిరిగి టేబులుదగ్గరకు వెళ్లాను. రిసీవరెత్తి రంజిత్ షా నంబరు తిప్పాను.

మిస్ మూసా కంఠం అటువైపునుంచి వినపడింది.

"పరశురామ్ స్పీకింగ్! రంజిత్ షా అర్జెంటుగా కావాలి," అన్నాను.

క్షణంలో అతను అటువైపు వచ్చాడు.

"మిస్టర్ రంజిత్ షా, మీకు చాలా థాంక్స్."

"మిస్టర్ పరశురామ్, మీరు నాకు థాంక్స్ చెప్తారని మొదటే అన్నానుగా!"

"మిస్టర్ షా మీరు పూర్తిగా నిజం చెప్పలేదు. ఆ పత్రం ఏమయింది?"

రంజిత్ షా విచిత్రంగా నవ్వాడు.

"మిస్టర్ పరశురామ్, పదిమంది నామీదకు రాళ్ళు విసురుతూ వుంటే నన్ను నేను కాపాడుకోడం తప్పు కాదని మీరు వొప్పుకోవాలి. ఆ పత్రం ప్రభుత్వం ఫైల్సులో వుంటే నేను కష్టాలపాలవుతాను. అయిదు లక్షలు పడేసి దాన్ని కొన్నాను. ఆ పత్రం అగ్నిదేవుడికి ఆహుతి అయిపోయింది. అది మీకెక్కడా దొరకదు. బలరామ్ హత్యకు నేను కారకుడ్ని కానందుకు సంతోషిస్తున్నాను."

"మిస్టరు షా, జీవితంలో అడ్డదారులు తొక్కడం

మీ కలవాటయి పోయింది: కానీ ఎప్పుడో ఒకప్పుడు మీరు పోలీసులకు చిక్కుతారు" అని రిసీవర్ పెట్టేశాను.

ఇన్స్పెక్టర్ నాయర్ వైపు చూశాను.

"నాయర్ భాయ్, ఈ ఇల్లంతా సోదా చెయ్యండి. లక్షలకి లక్షలు బ్లాక్ మనీ మీకు దొరకొచ్చు."

"అలాగే బ్రదర్!" అన్నాడు ఇన్స్పెక్టర్ నాయర్.

ఇన్స్పెక్టర్ నాయర్ తో కరచాలనం చేసి బయటకు నడిచాను.

— :ఐపోయింది: —